


# చైనా అణు రహస్యాలు లీక్..

చైనాలో అత్యంత శక్తిమంతమైన సైనికాధికారి ఒకరు వివాదంలో ఇరుక్కున్నారు. అవినీతితో పాటు కీలకమైన అణ్వాయుధాల రహస్యాలను అగ్రరాజ్యానికి లీక్ చేశారన్న ఆరోపణలు రావడంతో ఆయనపై దర్యాప్తు మొదలైనట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ వార్త చైనా మిలిటరీలో తీవ్ర చర్చనీయాంశమైంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు సన్నిహితుడైన జనరల్ జాంగ్ యూక్సియా.. ప్రస్తుతం ఆ దేశ సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో అత్యున్నత స్థాయి అధికారి ఈయనే. ఇటీవల జాంగ్‌పై అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ సంచలనాత్మక కథనం ప్రచురించింది. చైనా అణ్వాయుధ ప్రోగ్రామ్‌కు సంబంధించిన కీలక సాంకేతిక డేటాను జాంగ్ అమెరికాకు లీక్ చేశారన్నది దాని సారాంశం. చైనీస్ మిలిటరీలోని ఉన్నతస్థాయి వర్గాలను ఉటంకిస్తూ వాల్‌స్ట్రీట్ జర్నల్ ఆ కథనం రాసింది. అంతేకాదు.. ప్రమోషన్ల విషయంలో జాంగ్ యూక్సియా పెద్దఎత్తున లంచాలు తీసుకున్నాడని, కిందిస్థాయి ఉద్యోగులపై వేధింపులు, ఆయుధ పరికరాల కొనుగోళ్లలో అవినీతికి పాల్పడ్డాడని ఆయనపై ఆరోపణలు వచ్చినట్లు ఆ కథనం తెలిపింది. దీంతో చైనా రక్షణ మంత్రిత్వశాఖ ఆయనపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు పేర్కొంది. అవినీతి నిర్మూలనకు చైనా కమ్యూనిస్ట్ పార్టీ చేపట్టిన కఠిన చర్యల్లో భాగంగానే జాంగ్‌పై దర్యాప్తు జరుగుతోందని వాషింగ్టన్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి చెప్పినట్లు ఆ కథనం తెలిపింది. అయితే, దీనిపై చైనా నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటనేదీ రాలేదు. ఇదిలాఉండగా.. ఈ కథనం తర్వాత సామాజిక మాధ్యమాల్లో జాంగ్‌పై మరిన్ని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు వ్యతిరేకంగా సైనిక తిరుగుబాటుకు ప్రయత్నం జరిగిందనే ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలోనే జాంగ్‌తో పాటు మరికొంతమంది సీనియర్? జనరల్స్‌ను నిర్బంధించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, వీటిని చైనా అధికారులు గానీ.. పశ్చిమదేశాల నిఘా సంస్థలు గానీ ధ్రువీకరించలేదు.



# వెనెజువెలాపై ఆపరేషన్.. రహస్య ఆయుధం పేరు ఇదే

వాషింగ్టన్ : వెనెజువెలా ఆపరేషన్‌లో ఉపయోగించిన రహస్య ఆయుధం పేరును అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఆ దేశ సైన్యాన్ని నిర్వీర్యం చేసేందుకు తమ బలగాలు 'ది డిస్కాంబోబులేటర్' వాడినట్లు తెలిపారు. అమెరికా దళాలు ఆ ఆయుధాన్ని వాడగానే ప్రత్యర్థుల వెపన్స్ పని చేయలేదని ట్రంప్? పేర్కొన్నారు. దీని గురించి ఎక్కువగా మాట్లాడేందుకు తనకు అనుమతి లేదని చెప్పారు. "వారి వద్ద రష్యా, చైనా రాకెట్లు ఉన్నాయి. కానీ వాటిని ప్రయోగించలేకపోయారు. మేము రాగానే.. వారు బటన్స్ నొక్కినా అవేవీ పనిచేయలేదు" అని తమ ఆయుధం గురించి వెల్లడించారు. వెనెజువెలాపై మెరుపుదాడి చేసి ఆ దేశ నేత నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా దళాలు నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అగ్రరాజ్యం ఓ రహస్య ఆయుధాన్ని ఉపయోగించినట్లు కథనాలు వచ్చాయి. సీక్రెట్ సోనిక్ వెపన్‌ను వినియోగించినట్లు కొన్నిరోజుల క్రితం ధ్రువీకరించిన ట్రంప్.. తాజాగా దాని పేరు వెల్లడించారు.



# భారత నూలుకు డ్యూటీ ఫ్రీ సౌకర్యం తొలగించాలి..

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా మహమ్మద్ యూనస్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి భారత్ -బంగ్లాల మధ్య దౌత్య, వాణిజ్య సంబంధాలు వేగంగా క్షీణిస్తూ వచ్చాయి. మరోవైపు ఆ దేశంలోని హిందువులపై దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్?కు వ్యతిరేకంగా అక్కడి వస్త్ర పరిశ్రమ వర్గాలు మరో డిమాండ్‌ను తెర పైకి తీసుకువచ్చాయి. ఇప్పటివరకు భారత నూలుకు బంగ్లాదేశ్?లో ఉన్న డ్యూటీ-ఫ్రీ సౌకర్యం తొలగించాలని పట్టుబట్టాయి. లేదంటే ఫిబ్రవరి 1 నుంచి కర్మాగారాలు మూసివేస్తామని బంగ్లా ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఈ మేరకు ఆ దేశ వాణిజ్యశాఖ నుంచి నేషనల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూకు లేఖ అందినట్లు యూనస్ ప్రభుత్వం పేర్కొంది. జనవరి చివరి నాటికి భారత నూలుకు సుంకం లేని దిగుమతి సౌకర్యాన్ని ఉప సంహరించుకోకపోతే దేశవ్యాప్తంగా అన్ని స్పిన్నింగ్ యూనిట్లలో కార్యకలాపాలు నిలిపేస్తామని దేశీయ మిల్లర్లు హెచ్చరించారు. చాలా ఏళ్లుగా సుంకం లేకుండా భారత్? నుంచి చౌకగా నూలును దిగుమతి చేసుకుంటుండడం వల్ల స్థానిక స్పిన్నింగ్ యూనిట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని వారు లేఖలో పేర్కొన్నారు. దీనివల్ల దేశీయ వస్త్ర పరిశ్రమలో 12వేల కోట్ల కంటే ఎక్కువ విలువైన అమ్ముడుపోని నిల్వలు మిగిలిపోయాయని తెలిపారు. 50కి పైగా వస్త్ర పరిశ్రమలు మూసేయడం వల్ల వేలాదిమంది కార్మికులు నిరుద్యోగులుగా మారారన్నారు. మరోవైపు బంగ్లాదేశ్ వస్త్ర పరిశ్రమ వర్గాల డిమాండ్‌ను అక్కడి వస్త్ర ఎగుమతిదారుల సంఘం వ్యతిరేకిస్తోంది. భారత్ నుంచి దిగుమతి చేసుకున్న నూలుతో పోలిస్తే స్థానికంగా ఉత్పత్తి చేస్తున్న నూలు ఖరీదైనదని ఎగుమతిదారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ దుస్తుల బ్రాండ్లు, మెరుగైన నాణ్యత విషయాల్లో ప్రపంచ దేశాలు భారత్‌లో ఉత్పత్తి అయ్యే నూలుకు ప్రాముఖ్యత ఇస్తాయన్నారు. ఇప్పుడు భారత్‌కు ఉన్న డ్యూటీ-ఫ్రీ సదుపాయాన్ని నిలిపివేస్తే అక్కడి నుంచి ఎగుమతులు తగ్గుతాయన్నారు. దీనివల్ల ప్రపంచ దుస్తుల మార్కెట్‌లో పోటీని బంగ్లాదేశ్ ఎదుర్కోలేదన్నారు.

# ఆ సిఫార్స్ చేస్తే కేంద్ర ఉద్యోగుల జీతం మూడింతలు

కేంద్ర ప్రభుత్వంలో పనిచేసే ఉద్యోగులకు బేసిక్ పే ఒక్కసారిగా పెరగనుంది అని అంటున్నారు. అది ఎలా అంటే 8వ వేతన సంఘం సిఫార్సులతో. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్ లో 8వ వేంతన సంఘాన్ని ప్రకటించింది. ఈ వేతన సంఘం సిఫార్సుల మీదనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కోటి ఆశలు పెట్టుకున్నారు. తమకు అనుకూలంగా కనుక సిఫార్సులు ఉంటే పండుగే అని వారు అంటున్నారు.

**పదేళ్ల తరువాత :** ప్రతీ పదేళ్ళకు ఒకసారి కేంద్రం వేతన సంఘాన్ని నియమిస్తుంది. అది 2016లో చివరి సారి ఏడవ వేతన సంఘం వల్ల ఉద్యోగుల జీతాలు పెరిగాయి. నాటి నుంచి చూస్తే 2026 వచ్చేసింది. దాంతో ఎంతో మంది ఉద్యోగులు తమ జీతాల పెరుగుదల మీద తమ ఆర్థిక ప్రయోజనాల మీద కొత్త వేతన సంఘం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు 8వ వేతన సంఘం ఏర్పాటు అయిది. కానీ ఈ వేతన సంఘం తన సిఫార్సులను కేంద్రానికి అందించేలా నివేదిక రూపొందించందుకు ఏకంగా 18 నెలల గడువు ఉంటుంది. దాంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అంతా తమకు అనుకూలంగా సిఫార్సులు చేస్తారని ఆశిస్తున్నారు.

**ఫిట్ మెంట్ మీదనే :** ఫిట్ మెంట్ ఎంత సిఫార్సు చేస్తారు అన్న దాని మీదనే ఉద్యోగి బేసిక్ పే అన్నది ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఫిట్ మెంట్ అన్నది 2 పాయింట్స్ గా ఉంటే బేసిక్ పే రెట్టింపు అవుతుంది అన్న మాట. ఒక ఉద్యోగికి 20 వేల రూపాయలు జీతం ఉంటే కనుక అది రెట్టింపుగా నలభై వేలు అవుతుంది. అదే 3 పాయింట్స్ తో ఫిట్ మెంట్ గా వేతన సంఘం సిఫార్స్ చేస్తే కనుక ఏకంగా అరవై వేలకు ఎగబాకుతుంది. ఇపుడు కేంద్ర ఉద్యోగులు అదే కోరుకుంటున్నారు. 8వ వేతన సంఘం తన సిఫార్సులలో ఫిట్ మెంట్ పాయింట్స్ ని 3.25గా ఉండాలని కోరుతుంటున్నారు.

**డిమాండ్లు పెట్టారు :** ఇదిలా ఉంటే నేషనల్ కౌన్సిల్ ఆఫ్ జాయింట్ కన్సల్టేటివ్ మెషీనరీ ఈ మేరకు 8వ వేతన సంఘానికి డిమాండ్లు పెట్టింది. ఫిట్ మెంట్ ఫ్యాక్టర్ ని 3.25గా ఉంచాలని అందులో కోరింది. ఆ విధంగా చేస్తేనే మేలు జరుగుతుందని స్పష్టం చేస్తోంది. ఈ ప్రతిపాదనలను వేతన సంఘం సవరిస్తుందని కూడా బలంగా నమ్ముతోంది. పదేళ్ళ క్రితం చూస్తే జీతాలు బాగా పెరిగాయి. ఏడవ వేతన సంఘం పుణ్యమాని అప్పట్లో ఆరేడు వేల జీతాలు ఉన్న వారు అంతా 3 పాయింట్స్ తో ఫిట్ మెంట్ సిఫార్స్ చేయగా ఏకంగా 20 వేల దాకా జీతాలను అందుకునే స్థాయికి వచ్చారు. ఈ పదేళ్ళలో అన్ని రకాలుగా ద్రవ్యోల్బనం పరిస్థితులు ఉన్నాయి కాబట్టి పెరిగిన ధరలు ఇతర ఆర్థిక పరిస్థితులను 8వ వేతన సంఘం పరిగణనలోకి తీసుకుంటుందని దాంతో మరో సారి మూడింతలు వేతనాలు పెరుగుతాయని వారు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు. చూడాలి మరి ఏమి జరుగుందో.

# పద్మ పురస్కార గ్రహీతలకు ఇచ్చేది ఏంటంటే ?




దేశంలో పౌర పురస్కారాలకు ఎంతో విలువ గౌరవం ఉన్నాయి. ఈ పురస్కారాలు నాలుగు కేటగిరీలు గా ఉంటాయి. భారత రత్న ఇందులో అగ్ర తాంబూలంగా ఉంటుంది. ఇక పద్మ పురస్కారాలలో అత్యున్నతమైనది ద్వితీయమైనది పద్మ విభూషణ్. మూడవ కేటగిరీలో పద్మభూషణ్ ఉంటుంది. పద్మశ్రీ నాలుగో కేటగిరీలో ఉంటుంది. ఇక పద్మ పురస్కారాల ఎంపిక ప్రత్యేకంగా జరుగుతుంది.

**కమిటీ ద్వారా :** ఎంతో పారదర్శకంగా పద్మ అవార్డుల ఎంపిక జరుగుతుంది. ప్రధాని ప్రతీ ఏటా పద్మ అవార్డుల కమిటీని ఏర్పాటు చేస్తరు. కేంద్ర కేబినెట్ సెక్రటరీ ఈ కమిటీకి అధ్యక్షత వహిస్తారు. గతంలో ఈ కమిటీ ద్వారానే అవార్డుల ఎంపిక జరిగేది. కానీ నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక ప్రజల భాగస్వామ్యం కల్పించారు. ప్రజలు ఎవరైనా అర్హులు ప్రతిభ కలిగిన వారు ఉంటే వారి పేరు సిఫార్సు చేయవచ్చు. అలాగే తాముగా కూడా సెల్ఫ్ నామినేషన్ గా కమిటీకి నివేదించవచ్చు. ఈ విధంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కమిటీ ఇచ్చిన జాబితాను ప్రధాని రాష్ట్రపతి ఆమోదించిన తరువాత గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రకటిస్తారు.

ఇక ప్రతీ ఏటా మార్చి ఏప్రిల్ నెలలలో విడతల వారీగా ఈ పద్మ అవార్డుల ప్రదానం జరుగుతుంది.

**తేడా ఏమిటి అంటే :** పద్మ విభూషణ్ అవార్డు గ్రహీతలు సాధారణ తీరులో అత్యున్నతమైన సేవలు దేశానికి అందించిన వారుగా ఉంటారు. పద్మభూషణ్ గ్రహీతలు ఏదైనా ఒక రంగం తీసుకుని అందులో అగ్ర స్థానానికి చేరుకుని అందరి మన్ననలు అందుకుంటారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు ఏ రంగంలోనైనా ప్రతిభావంతమైన సేవలు అందించి జనం మెప్పు పొందుతారు సామాన్యులు కూడా పద్మశ్రీ అవార్డులు పొందేందుకు అర్హులుగా ఉంటారు.

**ఇచ్చేది ఏంటంటే :** పద్మ పురస్కార గ్రహీతలకు నగదు బహుమతి ఇస్తారు అన్నది ఒక అపోహ మాత్రమే. అలాంటిది ఏదీ ఇవ్వరు. రాష్ట్రపతి సంతకంతో ప్రశంసా పత్రం, అలాగే ఒక పతకాన్ని అందిస్తారు. పద్మ అవార్డీలకు ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనేందుకు అధికారిక ఆహ్వానం ఉంటుంది. వారిని రాష్ట్ర అతిధులుగా చూస్తారు. వారు ఏదైనా పని మీద ఇతర రాష్ట్రాలకు వెళ్తే ప్రభుత్వ అతిధి గృహంలో వారికి వసతి సదుపాయంతో పాటు రక్షణ కల్పిస్తారు. అలాగే దేశంలోని రైళ్ళలో ఉచిత ప్రయాణం చేయవచ్చు.

**నిబంధనలు పాటించాల్సిందే :** పద్మ అవార్డులు ఒక గుర్తింపు గౌరవంగా మాత్రమే ఉంటాయి. ఇవి బిరుదు అన్నది ఎంత మాత్రం కాదు, అందువల్ల తమ పేరుకు ముందు లేదా వెనక ఎవరైనా వీటిని వినియోగిస్తే వెంటనే ఆ అవార్డులను వెనక్కి తీసుకుంటారు. ఆ అధికారం ప్రభుత్వానికి ఎపుడూ ఉంటుంది. ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో ఎంతో మంది సామాన్యులకు కూడా పద్మశ్రీలు దక్కుతున్నాయి. దానికి కారణం కేంద్రం సవరించిన నిబంధనలు ప్రజల భాగస్వామ్యం కూడా పెరగడం అని అంటారు.


# అమెరికా సరిహద్దుల్లో 'భారత' అలజడి

## ప్రతి 20 నిమిషాలకో అరెస్ట్!

మెరుగైన జీవితం.. భారీ జీతం.. విలాసవంతమైన జీవనశైలి.. ఈ 'అమెరికా కల' సాకారం చేసుకోవాలని తపించే భారతీయుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అయితే సరైన మార్గంలో వెళ్లడం కష్టతరమవ్వడంతో చాలామంది ప్రాణాలకు తెగించి అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు. తాజాగా యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) విడుదల చేసిన గణాంకాలు ఈ పరిస్థితి తీవ్రతను కళ్లకు కడుతున్నాయి.

**ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు....** 2025 సంవత్సరపు గణంకాల ప్రకారం.. అమెరికా సరిహద్దుల్లో భారతీయుల అరెస్టులు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ప్రతి 20 నిమిషాలకో భారతీయుడు సరిహద్దుల్లో పట్టుబడుతున్నారు. గడిచిన ఏడాదిలో సుమారు 23,830 మంది భారతీయులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. 2024లో ఈ సంఖ్య 85,119గా ఉండటం గమనార్హం. అంటే గత ఏడాదితో పోలిస్తే సంఖ్య తగ్గినా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉంది.

**ఎందుకు ఈ రిస్క్?...** భారతీయులు ఇంత భారీ సంఖ్యలో అక్రమంగా ప్రవేశించడానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి..



హెచ్-1బీ వంటి చట్టబద్ధమైన వీసాల లభ్యత తక్కువగా ఉండటం.. వెయిటింగ్ పీరియడ్ ఎక్కువగా ఉండటంతో చాలామంది షార్ట్?కట్ వెతుక్కుంటున్నారు. మానవ అక్రమ రవాణా చేసే ముఠాలు "డొంకీ రూట్" వంటి ప్రమాదకరమైన మార్గాల ద్వారా అమెరికా చేరవేస్తామని యువతను నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. భారతీయులు ఎక్కువగా కెనడా లేదా మెక్సికో సరిహద్దుల గుండా అడవులు, ఎడారులను దాటుకుంటూ అమెరికాలోకి ప్రవేశించే ప్రయత్నం చేస్తున్నారు.

**దేశ ప్రతిష్ఠపై ప్రభావం..** అక్రమ వలసలు కేవలం వ్యక్తిగత భద్రతకే కాకుండా దేశ ప్రతిష్ఠకు కూడా భంగం కలిగిస్తాయి. అంతర్జాతీయ వేదికలపై భారతీయ పాస్‌పోర్ట్ విలువపై ఇది ప్రభావం చూపుతుంది. నిజమైన పర్యాటకులు, విద్యార్థులు వీసాలు పొందే సమయంలో మరింత కఠినమైన తనిఖీలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

**యువతకు సూచనలు...** అక్రమ మార్గాల్లో వెళ్లడం వల్ల జైలు శిక్ష, బహిష్కరణ ప్రాణహాని కలిగే అవకాశం ఉంది. అందుకే ఎడ్యుకేషన్ వీసా, వర్క్ వీసా లేదా స్కిల్డ్ మైగ్రేషన్ వంటి అధికారిక మార్గాలను మాత్రమే ఎంచుకోవాలి. విదేశీ ప్రయాణాలకు ముందు భారత ప్రభుత్వం గుర్తించిన ఏజెన్సీల ద్వారా మాత్రమే సంప్రదింపులు జరపాలి. గమ్యం చేరడం ఎంత ముఖ్యమో ప్రయాణించే మార్గం అంతే సురక్షితంగా ఉండాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అక్రమ వలసలపై గ్రామీణ స్థాయి నుంచే అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# హిందువులకు మాత్రమే ఇక మీదట ఎంట్రీ!

దేశంలో ఎన్నో ప్రాచీన ఆలయాలు ఉన్నాయి. చారిత్రాత్మకమైన దేవాలయాలకు భారత దేశం పెట్టింది పేరు. వేలాది ఏళ్లుగా ఈ ఆలయాలు కొనసాగుతున్నాయి. ఇక భారత్ అంటే భిన్న సంస్కృతులు మతాలు వ్యవహారాలు ఆచారలతో నిండినది. దాంతో ఎక్కడికి ఎవరైనా వెళ్ళవచ్చు అన్నది ఉంది. ముఖ్యంగా హిందూ ఆలయాలలో అన్య మతస్థులకు ప్రవేశం ఉందా అంటే విశ్వాసం ఉందని డిక్లరేషన్ చేస్తే వెళ్లవచ్చు అన్నది ప్రధాన ఆలయాలలో నియమంగా ఉంది. చాలా చోట్ల అది కూడా అవసరం లేకుండా వెళ్ళవచ్చు. అయితే ఇపుడు కొత్తగా ఒక నిబంధనను తీసుకుని రాబోతున్నారు. అదేంటి అన్నది ఆసక్తికరంగా ఉంది.

**బద్రీనాథ్ కేదార్ నాథ్ :** దేశంలో ఉత్తరాన ఉన్న అత్యంత పవిత్రమైన ఆలయాల్లో ఒకటైన బద్రినాథ్ కేదార్ నాథ్ లలో దర్శనానికి వచ్చే భక్తుల విషయంలో కొత్త నిబంధన తీసుకుని రాబోతున్నారు. ఈ ఆలయాలలో ఇక మీదట ప్రవేశాలను కట్టుదిట్టం చేయబోతున్నారు. ఈ మేరకు కీలక ప్రతిపాదనలనే ఆలయ కమిటీని ముందుకు తీసుకుని వచ్చింది.

**కేవలం హిందువులకే :** దేశంలో ఎంతో కీలకమైన బద్రీనాథ్ కేదార్ నాథ్ ఆలయాలలో ప్రవేశం ఇక మీద హిందువులకే ఉండబోతోంది.



ఈ మేరకు ఆలయ కమిటీ త్వరలో సమావేశమై తీర్మానించనుంది. ఈ విషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ హేమంత్ ద్వివేదీ ధృవీకరించారు. కేవలం ఈ రెండు ఆలయాలు మాత్రమే కాదు ఈ ఆలయ కమిటీ పరిధిలోకి వచ్చే మరిన్ని ఆలయాలకు ఇదే నిబంధన వర్తిస్తుందని ఆయన చెప్పుకొచ్చారు.

**ఇప్పటికే అక్కడ అమలు :** ఇదిలా ఉంటే ఇప్పటికే గంగోత్రి ధాం లోకి హిందువులు కానీ వారిని ప్రవేశం నిషేధించారు. గంగోత్రి టెంపుల్ కమిటీ దీనిపైన ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. దాంతోనే బద్రీనాథ్ కేదారి నాథ్ ఆలయాలకు సంబంధించి ఆలయ ప్రవేశం పైన నిబంధలకు ప్రతిపాదనలు వచ్చాయి. అయితే ఈ కొత్త నిబంధన అమలు ఎప్పటి నుంచి అన్నది మాత్రం ఆలయ కమిటీ ఇంకా తెలియచేయలేదు.

**చార్ ధాం యాత్ర కోసం :** దేశంలో చార్ ధాం యాత్ర కోసం లక్షలాది మంది భక్తులు ప్రతీ ఏటా ఇక్కడికి వస్తూంటారు ఈ ఆలయాలలో ఆ సమయాలలో కిక్కిరిసి ఉంటుంది. ప్రతీ ఏటా శీతాకాలం ఆలయం తలుపులు మూసివేస్తారు, తిరిగి ఎండా కాలం ప్రవేసితూనే ఏప్రిల్ నెలలో తెరుతారు. అలా ఆరు నెలల పాటు ఆలయాలలో భక్తుల దర్శనాలు అనుమతిస్తారు. ఈ ఏడాది చూస్తే కనుక ఏప్రిల్ 23 నుంచి బద్రీనాథ్ కేదారి నాథ్ ఆలయాలు తెరచుకుంటాయని చెబుతున్నారు. అలాగే గంగోత్రి యమునోత్రి ఆలయాలు కూడా ఏప్రిల్ 19 నుంచి తెరుస్తారు. మొత్తం మీద చూస్తే కీలక మైన ఆలయాలకు ఈ కొత్త నిబంధన అమలు అయితే దేశంలోని ఇతర పుణ్య క్షేత్రాలు కూడా అనుసరిస్తాయా అన్న చర్చ అయితే సాగుతోంది.

